క్లుప్తంగా

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయొద్దు

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా ఎటువంటి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసుకోవద్దని, స్థానికంగా వాటిని ఏర్పాటు చేయడం నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతి లేకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లయితే పురపాలక చట్టం–2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా స్పీడ్ బ్రేకర్లను డొనేట్ చేయదలచినవారు మున్సిపల్ కార్యాలయంలో సమాచారం ఇచ్చినట్లయితే మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో వాటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అవసరంలేని ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం ద్వారా వాహనదారులకు ప్రమాదాల గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. అంతేకాకుండా మున్సిపల్ రోడ్లు డ్యామేజ్ అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని స్థానికులు గమనించాలని సూచించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం


పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న కమిషనర్, విద్యార్థులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెల్లాపూర్ మున్సిపాలిటీ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ కస్తూర్బా పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలిసి గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విరివిగా మొక్కలు నాటుతూ భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో లక్ష మొక్కలను నాటనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇంటికో మొక్కను అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏఈ మోనిక, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

వన మహోత్సవంలో భాగంగా రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి కార్పొరేటర్ పుష్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వన మహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు


చిత్రలేఖనాన్ని పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

జోగిపేట(అందోల్): జోగిపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. అధిక జనాభా వలన కలిగే సమస్యలను తెలుపుతూ ఈ పోటీలను నిర్వహించడంతో విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యాసరచన, చిత్రలేఖనం ద్వారా వ్యక్త పరిచారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్‌కుమార్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణయ్య, నరోత్తం, త్రినాథరావు, రాములు, చంద్రశేఖర్, హన్మంరాజ్, అమృత, రవికుమార్, లక్ష్మణ్, సరిత, మంజుల, సరితకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ధ్వంసం పనుల అడ్డగింత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మంగంపేట గ్రామంలో ఉన్న 55 సర్వేనెంబర్‌లో ఆజాద్ ఇంజనీరింగ్ పరిశ్రమ యజమాన్యం రోడ్డును ధ్వంసం చేయటంతో గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. మంగంపేట నుంచి ఊట్ల వరకు ఉన్న రోడ్డును ఆజాద్ ఇంజనీరింగ్ యాజమాన్యం ధ్వంసం చేస్తుండటంతో గ్రామస్తులు అడ్డుకొని బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ సంతోష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ధ్వంసం చేసిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతో గ్రామస్తులు వెనుతిరిగారు. ఆజాద్ పరిశ్రమ యాజమాన్యం నిబంధనలను అతిక్రమిస్తోందని, అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

బొంతపల్లిలో ఉచిత వైద్య శిబిరం

జిన్నారం: గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి గ్రామంలో ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ ఉమాదేవి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వంకాయ సాగు.. రాబడి బాగు

సస్యరక్షణ చర్యలతో సత్ఫలితాలు

- తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి
- యాజమాన్య పద్ధతులు పాటించాలని
- రైతులకు ఉద్యానశాఖ అధికారి సోమేశ్వర్‌రావు సూచన



పస్తాపూర్ శివారులో సాగు చేస్తున్న వంకాయ పంట

ఎన్ని కూరలున్నా వంకాయ కూర రుచే వేరు. అలాంటి వంకాయను సాగు చేసుకుంటే మంచి లాభాలు కూడా వస్తాయి. వంకాయ సాగులో అనేక ఇబ్బందులు ఉన్నా రైతులు సాగు చేస్తుంటారు. ఒక్కోసారి సరైన సస్యరక్షణ చర్యలు తీసుకోకపోతే చీడపీడలు ఆశించి తీవ్రంగా నష్ట పరుస్తాయి, దిగుబడి తగ్గి ఆదాయం రాకపోగా.. నష్టాలు వచ్చే అవకాశాలు కూడా ఉంటాయి. వంకాయ సాగు, ప్రధాన తెగుళ్ల వాటిని నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యావన శాఖ జిల్లా అధికారి సోమేశ్వర్‌రావు వివరించారు.

– జహీరాబాద్ టౌన్

వంకాయ జిల్లా అంతటా రైతులు సాగు చేస్తున్నారు. జహీరాబాద్ ప్రాంతంలో కూడా అధిక విస్తీర్ణంలో సాగవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ప్రతిరోజు కూరగాయల మార్కెట్‌కు పెద్ద మొత్తంలో వంకాయ సరాఫరా అవుతోంది. గిట్టుబాటు ధర కూడా ఆశించిన స్థాయిలో పలుకుతోంది. సాధారణంగా వంకాయను వర్షకాలంలో జులై నుంచి ఆగస్టు, చలికాలంలో నవంబర్–డిసెంబర్, వేసవిలో ఫిబ్రవరి నుంచి మార్చి మొదటి వారంలో నారును నాటుకోవాలి. సంకరజాతి వంకాయ విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. నర్సరీల నుంచి మేలైన రకం నారు తీసుకొని నాటాలి. సారవంతమైన మురుగు నీరు పోయేలా సౌకర్యం కలిగిన అన్ని రకాల నేలల్లో సాగు చేసుకోవచ్చు. నేలను 4–5 సార్లు బాగా దున్ని చదును చేయాలి. వర్షాకాలం పంటకు బోదెలు, కాలువలు ఏర్పాటు చేయాలి. చలికాలం, వేసవి పంటకు 4–5 చదరపు మీటర్ల వరకు మడులను తయారు చేసుకోవాల్సి ఉంటుంది.

నీటి యాజమాన్య పద్ధతులు

నారు నాటే ముందు లేదా నాటిన వెంటనే నీరు పెట్టాలి. భూమిలో తేమను బట్టి చలికాలంలో వారం నుంచి 15 రోజులకు ఒకసారి, వేసవిలో 4–5 రోజులకు ఒకసారి నీటి తడులు ఇవ్వాలి. వేసవిలో కాయ కోయడానికి 1–2 రోజుల ముందు నీరు ఇవ్వాలి. కలుపు నివారణకు వంగనారు నాటిన 48 గంటల్లో అలాక్లోర్ 10 లీటర్లు నేలపై పిచికారీ చేయాలి. 25–30 రోజుల్లో గొర్రు లేదా గుంటకతో అంతర కృషి చేయాలి. ఎరువులు వేసే ప్రతిసారి బోదెలు సరిచేస్తే పంట బాగా పెరిగే అవకాశం ఉంటుంది. పేను బంక, తెల్లదోమ, రసం పీల్చే, కాయలు తొల్చే పురుగులు ఆశిస్తాయి. అధికారుల సూచన మేరకు మందులను పిచికారీ చేస్తే మెరుగైన ఫలితాలు పొందవచ్చు.

సాగు విధానం

పొడువుగా నిటారుగా పెరిగే రకాలకు 60–60 సెంటీ మీటర్ల గుబురుగా పెరిగే రకాలకు 75–50 సెంటీ మీటర్ల దూరంలో నాటాలి. ఎకరాకు 200 కిలోల వేప పిండిని దుక్కిలో వేసుకొవాలి. బాక్టీరియా ఎండు తెగులు ఉండే ప్రాంతాల్లో ఎకరాకు 6 కిలోల చొప్పున బ్లీచింగ్ పొడిని వేసుకొవాలి. రసం పీల్చే పురుగు రాకుండా ఎకరానికి 10 కిలోల చొప్పున కార్బొఫ్యూరాన్ గుళికలను నాటే ముందు వేసుకొవాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు 2–4 టన్నుల బయో మిచ్చర్ వేసి కలియదున్నాలి. నాటిన 30 నుంచి 60 రోజుల్లో 24 కిలోల పొటాష్ 40 కిలొల నత్రజని, 200 కిలోల అమ్మోనియం సల్ఫేట్ లేదా 85 కిలోల యూరియా మూడు భాగాలు చేసి మూడు సార్లు వేయాలి.

మంచి డిమాండ్ ఉంది



కూరగాయల మార్కెట్‌లో వంకాయలకు మంచి డిమాండ్ ఉంది. శుభకార్యాల సమయానికి పంట చేతి కంది వచ్చినట్లయితే మంచి లాభాలు వస్తాయి. పెళ్లిల సీజన్ వరకు కాత వచ్చే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.40 నుంచి రూ.60 తక్కువ పలకడం లేదు. శ్రావణం, కార్తీక మాసం, పెళ్లిల సమయాల్లో కిలో రూ.50 లెక్కన 40 కిలోలకు రెండు వేల వరకు ఆదాయం వస్తుంది. ఖర్చు పోనూ ఎకరాకు రూ.50వేల వరకు రైతుకు మిగులుతుంది.

– అశోక్‌రెడ్డి, రైతు, పస్తాపూర్

జాగ్రత్తలు తీసుకోవాలి



వంకాయ సాగులో అనేక ఇబ్బందులు ఉంటాయి. అయినా ధర కలిసి వస్తే రైతులకు మంచి లాభాలు వస్తాయి. తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పరిస్థితులు అనుకూలించనప్పుడు చీడపీడలు ఆశించి తీవ్రంగా నష్టపరుస్తాయి. పంట మార్కెట్‌కు వెళ్లే వరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సమీప ఉద్యావన శాఖ అధికారులను సంప్రదించాలి.

– సోమేశ్వర్‌రావు, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి

బీహెచ్‌ఈఎల్ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) బీహెచ్‌ఈఎల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అనుబంధ సంస్థ) సర్వసభ్య సమావేశాన్ని భెల్ యూనియన్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీహెచ్‌ఈఎల్ వర్కర్స్ యూనియన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ యూసుఫ్ రిటర్నింగ్ అధికారిగా వ్యవరించారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కృష్ణం రాజు మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నియంత్రించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

కంగ్టి(నారాయణఖేడ్): ప్రపంచ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ జల, వాయు కాలుష్యం, ఆహార కాలుష్యాలను నియంత్రించడం ద్వారా వాతావరణం సమతూల్యంగా ఉంటుందన్నారు. అనంతరం కంగ్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి నేతాజీ సుభాష్ చంద్ర బోస్ క్రాంతిచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ లక్ష్మణ్, నర్సులు, ఏఎన్ఎంలు, ల్యాబ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దుర్గమ్మ తల్లికి ఎమ్మెల్యే పూజలు

ఆషాఢమాసం పురస్కరించుకొని మండల పరిధిలోని అనంతసాగర్‌లో గురువారం నిర్వహించిన దుర్గమ్మ బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్, బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, రాములు, భూపాల్‌గౌడ్, లక్ష్మీకాంత్, సంగమేశ్వర్, భక్తులు పాల్గొన్నారు.

కొండాపూర్(సంగారెడ్డి)


బోనాల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నాయకులు

భక్తిశ్రద్ధలతో వరుణయాగం

పట్టణంలోని సంగమేశ్వర మందిరంలో వార్షికోత్సవ పూజలు, వరుణయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం సర్వోత్తమ శర్మ ఆధ్వర్యంలో శివలింగానికి రుద్రాభిషేకం, పూజారి లీలావతి మోహన్‌రావు దంపతులు వరుణయాగం నిర్వహించారు. నర్సింహారావు కులకర్ణి, ఆకుల శివకుమార్, నరేష్ దేశ్‌పాండే, సత్యనారాయణ కులకర్ణి, రాజేశ్వరరావు, రంగారావు, సురేష్, దత్తాత్రేయరావు, కర్ణం జ్యోతి, రాధిక, సుబ్బలక్ష్మి, బిఎన్, శంకర్‌రావు, నారాయణరావు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి):


సదాశివపేట పట్టణం శ్రీసంగమేశ్వర మందిరంలో శివలింగానికి రుద్రాభిషేకం చేస్తున్న బ్రాహ్మణులు

ఎస్‌ఐలుగా బాధ్యతలు స్వీకరణ

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం ఎస్‌ఐగా నాగలక్ష్మి గురువారం నియమితులయ్యారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న విజయారావు బదిలీపై అమీన్‌పూర్ పీఎస్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలోని మహిళా పీఎస్ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన నాగలక్ష్మి బదిలీపై జిన్నారం వచ్చారు. శుక్రవారం నాగలక్ష్మి ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరిస్తారు. జిన్నారం నూతన మండలంగా ఏర్పాటైన నాటి నుంచి ఎస్‌ఐగా మొదటిసారి మహిళా ఎస్‌ఐ నియామకం కావడం ఇదే ప్రథమం.

జోగిపేట ఎస్‌ఐగా పాండు


ఎస్‌ఐ పాండు

జోగిపేట(అందోల్): జోగిపేట ఎస్‌ఐగా పాండు గురువారం బాధ్యతలను చేపట్టారు. జిల్లా కేంద్రం సంగారెడ్డిలో వీఆర్‌లో ఉన్న ఆయనను జోగిపేట ఎస్‌ఐగా నియమిస్తూ ఎస్పీ రూపేష్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం జోగిపేట ఎస్‌ఐగా పనిచేస్తున్న అరుణ్‌కుమార్‌గౌడ్‌ను కోహీర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

వట్‌పల్లి ఎస్‌ఐగా సంగమేశ్వర్


ఎస్‌ఐ సంగమేశ్వర్

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి ఎస్‌ఐగా సంగమేశ్వర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి స్పెషల్ బ్రాంచి పోలీసు విభాగంలో పనిచేసి బదిలీపై ఇక్కడి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన కోటేశ్వర్ రావు సంగారెడ్డికి బదిలీ అయ్యారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి


రాజేష్ నాయక్

మునిపల్లి(అందోల్): శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని బుదేరా ఎస్‌ఐ రాజేష్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని బుదేరా పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ నుంచి బుదేరా పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జూదం, బెల్ట్‌షాపుల నిర్వహణ తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నేరాలను అదుపునకు కృషి చేస్తానని వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలి


లక్ష్మిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వట్‌పల్లి(అందోల్): గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తరించాలని లయన్స్ మాజీ జిల్లా పాస్ట్ గవర్నర్ లక్ష్మీ అన్నారు. బుధవారం నిర్వహించిన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరణోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో లయన్స్‌క్లబ్ ఎప్పుడూ ముందుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా డయాబెటిస్ సెక్రటరీ, డాక్టర్ అనంతరెడ్డి, లయన్స్ జిల్లా చైర్మన్ రాంబాబు, అధ్యక్షుడు మోహినోద్దీన్, ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, కోశాధికారి సిద్ధేశ్వర్, పెద్దన్న, లయన్స్ మాజీ అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి, మాజీ ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్, అందోల్ లయన్స్ కోశాధికారి సంతోష్‌కుమార్, విద్యాసాగర్, దిగంబర్‌రావు, మహేందర్ పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం జిల్లా కార్యదర్శిగా విజయ్‌కుమార్ ఎన్నిక

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన వెంకటాపూర్ గ్రామానికి చెందిన జంజిరాల విజయ్ కుమార్‌ను వివిధ పార్టీలకు చెందిన నాయకులు గురువారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పెద్ద పోచన్న, సత్యనారాయణ, బాబూజీ, సార కృష్ణ, వెంకటేశం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడితే చర్యలు

మియాపూర్ ఏసీపీ నరసింహారావు



నరసింహారావు, ఏసీపీ, మియాపూర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నకిలీ ప్రెస్ కార్డులు చూపించి బెదిరించి వసూళ్లకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని మియాపూర్ ఏసీపీ నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కొంతమంది చిన్నచిన్న నిర్మాణాదారులు, వ్యాపారులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నకిలీ పాత్రికేయులు, రాజకీయ నాయకులమని బెదిరిస్తున్న కొంతమందిని గుర్తించినట్లు తెలిపారు. వీరిపై కొత్తగా అమలులోకి వచ్చిన చట్టాల ప్రకారం.. కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బెదిరింపులు ఎదుర్కొంటున్న వారు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించేవారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వ్యక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ జనాభా నియంత్రణపై అవగాహన



జిన్నారం: మండల పరిధిలోని మాదారం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ అమీన్‌పూర్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవం గురువారం జనాభా నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ ఏఎస్‌ఐ భిక్షపతికి సన్మానం



మునిపల్లి(అందోల్): బదిలీపై వెళుతున్న ఏఎస్‌ఐ భిక్షపతికి బుదేరా ఎస్‌ఐ సురేష్, పోలీస్ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ఏఎస్‌ఐ భిక్షపతిని కంది మండల పరిధిలోని ఇంద్రకరన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

◆ ఉచిత దంత పరీక్షలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తెలంగాణ మోడల్ పాఠశాల విద్యార్థులకు భారత్ వికాస్ పరిషత్, రాణి రుద్రమ బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత దంత పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ సన్మానం

నారాయణఖేడ్: సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా నియామకమై బాధ్యతలు స్వీకరించిన నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన వైజ్యనాథ్ పాటిల్ గురువారం ఎమ్మెల్యే సంజీవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైజ్యనాథ్ పాటిల్‌ను ఎమ్మెల్యే సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వైజ్యనాథ్ పాటిల్ కూడా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

◆ అమ్మవారికి ప్రత్యేక పూజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ముంగి గ్రామ శివారులో ఆదిలక్ష్మి ఆశ్రమంలో వారాహీదేవి నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం కాత్యాయనిదేవికి అభిషేకం కుంకుమార్చన చండీ హోమం తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

◆ బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



జహీరాబాద్ టౌన్: కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ జన్మదినం సందర్భంగా బీజేపీ నాయకులు పట్టణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. యువత తప్పనిసరిగా రక్తదానం చేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ ఉపాధ్యాయులకు సన్మానం



కల్హేర్(నారాయణఖేడ్): బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను కల్హేర్ జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు రాజయ్య, మోహన్, మశ్చేందర్, మురళిగౌడ్ వివిధ పాఠశాలలకు బదిలీ అయ్యారు. ఎంఈఓ శంకర్, హెచ్ఎం శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచయ్య కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు దేవదాస్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ వాహనాల తనిఖీ

మునిపల్లి(అందోల్): మండలంలోని కంకోల్ జాతీయ రహదారిపై బుదేరా ఎస్‌ఐ రాజేశ్‌నాయక్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాల వంటి మత్తు పదార్థాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

నర్సాపూర్: అత్యవసర వైద్యం కావాల్సిన పేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మేలు జరుగుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం శివ్వంపేట మండలం శభాష్‌పల్లికి చెందిన సునీతకు రు.2.50లక్షలు ఎల్‌ఓసీని అందజేశారు. సునీత భర్త శ్రీకాంత్‌కు గుండె ఆపరేషన్ కోసం ప్రభుత్వం నుంచి ఎల్‌ఓసీ ద్వారా సహాయం వచ్చిందని చెప్పారు.

◆ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇబ్రహీంబాద్ శివారులో ఉన్న సాయిబాబా ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సాయిబాబా విగ్రహానికి పంచామృత అభిషేకాలను భక్తులతో నిర్వహించి అర్చనలు, పుష్పాభిషేకం, జలాభిషేకం చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాములు, సభ్యులు పాల్గొన్నారు.

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 8 మందిని అదుపులోకి తీసుకొని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి 7 మందికి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా, మరో వ్యక్తి రూ.2వేల చొప్పున జరిమానాతో పాటు ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

◆ అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి

శివ్వంపేట(నర్సాపూర్): శిక్షణ పొందిన టీచర్లు అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేయాలని ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ సీడీపీఓ హేమభార్గవి పిలుపునిచ్చారు. పూర్వప్రాథమిక విద్యపై మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. సూపర్‌వైజర్లు సంతోష, వసుమతి తదితరులు పాల్గొన్నారు.